7

# భయాందోళనతో కృంగిపోయిన వారిని దేవుడు ఎలాగు నయం చేయగలడు

## (1 రాజులు 19:1-21)

వర్షం కోసం ప్రార్థించగా దానికి జవాబు వచ్చినందుకు ఏలీయా ఎంతో ఉత్తేజంతో పూగిపోయాడు! బయలు ప్రవక్తలను తానెదుర్కొన్నప్పుడు తన దేవుడు విజయవంతుడైనాడు. "యెహోవాయే దేవుడు!" అంటూ ప్రజలు కేకలు వేయడం ఏలీయా తన చెవులారా విన్నాడు. చివరకు ఏకధారగా కురిసే జలప్రళయం ఈ కరువును పారద్రోలడం కళ్ళారా చూచాడు. 18వ అధ్యాయం చివరిభాగంతో ఏలీయా యెజ్రెయేలు గుమ్మం దగ్గర వేచియుండడం అదే సమయంలో అహాబు కూడ తన రాజ నగరుకు వెళ్లిపోయాడు. అప్పటి వరకు జరిగిన సంఘటనల పరోక్ష ప్రభావం, అధికారగుణం మీద మరోప్రక్క ప్రజానీకం మీద చూపుతుందని మరియు దేశమంతా ప్రభువు వైపు తిరుగునని ఏలీయా నమ్మియున్నాడు. ఆ ప్రవక్త ఎక్కడ లేని సంతోషంతో ఉప్పొంగిపోతున్నట్టుగా నేను చూస్తున్నాను.

కాని పరిస్థితులెలా తారుమారైనాయో 19వ అధ్యాయంలో మరియు కర్మెలు పర్వత ప్రాంతంనుండి నిరుత్సాహ లోయలోకి లోతుల్లోకి ఎలా ఏలీయా దిగజారిపోయాడో మనం చూస్తాం. "ఏలీయా మనవంటి స్వభావముగల మనుష్యుడే" అని (యాకోబు 5:17) యాకోబు సూచించాడు. బహుశ 1 రాజులు 19ని యాకోబు తలచినట్లుంది. ప్రభువు ఈ అధ్యాయమును బైబిల్లో ఉంచినందుకు సంతోషిస్తున్నాను. చిత్రపటాలను బాగుగా అలంకరించినందులకు నాకు సంతోషం. మనకు ఉన్న సమస్యలాంటిదే ఏలీయాను కూడ శ్రమపెట్టుచున్నదని ఎరుగుట మనకు సహాయమగును.

ఏలీయా యొక్క సమస్య ఏంటో మనం పరీక్షిద్దాం, అతనలా ఎందుకయ్యాడో, ఆ సమస్యను దేవుడు ఎలా పరిష్కారం చేశాడో చూద్దాం (1 రాజులు 19).

### భయాందోళనలతో కృంగదీసిన సమస్య (19:1-4)

"ఏలీయా చేసినదంతయును అతను ఖడ్గముచేత ప్రవక్తలనందరిని చంపించిన సంగతియును అహాబు యెజెబెలునకు" తెలిపాడు (1 వచనం). ఈ పరిస్థితిని గమనించండి: ఇదంతా బాగా నడిర్శూము అయింతర్వాత. ఒకవేళ యెజెబెలును నిద్రనుండి లేపుతానేమో అనుకొంటూ అహాబు తన పడక గదిలోకి మెల్లగా జారుకుంటాడు. చిన్నగా తన చెప్పులు విప్పేటప్పుడు రెండో చెప్పు టపామని క్రిందపడి శబ్దమయ్యేసరికి యెజెబెలమ్మగారికి

మెళుకువచ్చి, "అహాబు" అంటూ అరచిందేమో?

"నిన్ను లేపుతాననుకోలేదు సారీ, డియర్."

"అదికాదు, ఏమింత ఆలస్యంగా ఇల్లు చేరుకున్నావ్."

"అదేంటోగాని యివాళ చాలచాల బిజీగా ఉందీ."

"నీ వాలకం చూస్తుంటే నీ స్వరం వింటుంటే అహాబు ఏదో జరగరాంది జరిగినట్టుందే."

"సరేగాని అదంతా రేప్రొద్దున మాట్లాడుకుందాంలే."

"అహా అదేంకుదరదు *ఇప్పుడు* చెప్పాల్సిందే." (బహుశ మీలో ఎవరైనా భార్యలకు చెప్పకుండ విషయాలు దాచేవాళ్ళు ఉన్నట్లయితే ఈ ఘట్టం బాగా అర్థమవుతుంది.)

అహాబుకు ఏమి జరిగిందో ఆమెకు చెప్పసాగాడు: "ఆ ... ఆ ... అదే షూ ... భలే అచ్చెరువు కల్గించే రోజయింది, ఆకాశంనుండి అగ్ని దిగివచ్చేలా చేశాడు ఏలీయా."

యెజెబెలు ఆవలించుకొంది. "ఆ సంగతేంటి ఆహా అదంతా మనకు తెలిసిన పాత మంత్రమే. ఇదంతా నాయాకులకు నేనెప్పుడో నేర్పిన మంత్రమే అదెలా వాడాలో వాళ్ళకు తర్ఫీదు చేశాను కూడ."

"తర్వాత అతను వర్షం రాబోతుంది అన్నాడు. అతనలా చెప్పగానే వెంటనే వర్షం వస్తుందో రాదో అన్నట్లనిపించింది, ఉన్నట్లుండి మరోక్షణంలో వర్షం రానేవచ్చింది."

"వర్షమా? ఓహో అది బాగానే ఉంది. తమరు తడిచివచ్చింది అందుకా. అసలు సంగతేంటంటే అతనేమి గొప్ప చెప్పలేదు అప్పటికే వర్షం రాబోతువుంటే అతను వర్షం వచ్చుగాక అన్నాడు. అదలా కలిసివచ్చింది. యింకా మీరు చెప్పాల్సిందేదో ఉంది అదేదో దాచిపెడుతున్నారు."

యిక అహాబు రెండు మూడు సార్లు గుటకలుమింగాడు, ఒక్క సారి గుండె నిండా గాలిపీల్చుకుని మాట్లాడ్డానికి ధైర్యం పుంజుకున్నాడు, చెప్పడం మొదలెట్టాడు, "ఆ తర్వాత ఆ తర్వాత ... మరే ... ఏలీయా ప్రవక్తలందరిని ఆ వాగు దగ్గరకు తీసుకెళ్లాడు. తీసుకెళ్ళి ... తీసుకెళ్లి మరె (సనగడం ప్రారంభించాడు)."

"ఏంటీ?"

"తర్వాత ... అందరిని చంపేశాడు."

యెజెబెలు ఆ మాటవిన్నదో లేదో ఆమె ముఖం పాలిపోయి వుండవచ్చు, కొన్ని నిమిషాల పాటు నిశ్చేష్టురాలై నోటిమాట పడిపోయి ఉండవచ్చునని నేననుకొనుచున్నాను. యిక అంతకంటె దుఃఖముఖురాలైన స్త్రీని ప్రపంచంలో చూచివుండం.

ఏలీయా ఏదనుకుంటే అది జరుగుతుంది. అహాబు యెజెబెలును వివాహం చేసుకున్నాడు కాబట్టి ఈ అహాబుగారికి అంతా చుక్కెదురే.

"యెజెబెలు ఒక దూతచేత ఏలీయాకు వర్తమానము పంపించెను" (2వ వచనం). బహుశ ఏలీయా తన దగ్గరకు కూడ ఒక దూత సందేశంతో వస్తాడేమోనని ఎదురు చూస్తూ ఉన్నాడు – "ఆ వర్తమానికుడు వచ్చి అయ్యా మీరు రాజుగారి దర్బారులో ఒక సలహాదారుగా ఉండి, మేమంతా మరలా యెహోవా వైపుకు తిరుగునట్లు మాకు సహాయం చేయండి" అని చెబుతాడని అనుకున్నాడు. కాని అది కాదు ఆ సందేశం.

> యెజెబెలు ఒక దూతచేత ఏలీయాకు ఈ వర్తమానము పంపించెను – రేపు ఈ వేళకు నేను నీ ప్రాణమును వారిలో ఒకని ప్రాణమువలె చేయనియెడల దేవుడు నాకు గొప్ప అపాయము కలుగ జేయునుగాక (2 వచనం).

ఏలీయాకు యెజెబెలు సందేశాన్ని యింకో రీతిగా చెప్పాలంటే, "ఏలీయా 24 గంటల వ్యవధిలో నేనైనా చంపబడాలి లేదా నీవైనా చంపబడాలి"!

యెజెబెలు ఒక దూతను ఎందుకు పంపవలసివచ్చింది అంటూ అచ్చెరువు చెందుతారు. ఆమె గనుక అంత సీరియస్‌గా ఉన్నప్పుడు, ఎవడైనా అతన్ని వధించేవాడిని పంపవచ్చుగదా? వారంటారు ఇదంతా ఏదో దీనివెనుక ఒక సరికొత్త నాటకం ఉందనుకుంటున్నారు. నా అభిప్రాయం ప్రకారం (అది వాస్తవంగా కూడ) ఆమె మాత్రం గొప్ప రౌద్రంతోకూడి ఉంది. ఏలీయా రాజుగారికి వచ్చి కనబడడం గాని, లేదా ప్రవక్తలకుగాని లేదా ఇశ్రాయేలీయుల్లో కుటుంబ పెద్దలకుగాని అతను కనబడడానికి యెజెబెలు యిష్టపడలేదు. "వారంతా ఆమెకు ఒక చిన్న *గుంపు*. అతను కూడ *నన్ను* ముఖాముఖిగా యింతవరకు చూడను లేదు" అని ఆమె అనుకుంది. బహుశ యెజెబెలు ఏలీయాతో ఎదురెదురు పోరాటానికే దిగాలి అనుకుంది. అలా సవాలు చేస్తుంది. అది కూడ కర్మెలు పర్వతం మీద కాదు, కేవలం యెజ్రెయేలు నడి రోడ్డుమీదే పోరాటానికి సిద్ధమైంది యెజెబెలు.

ఈ విషయంలో ఏలీయా ఎలా స్పందించాడు? "అతడు భయపడి[1] లేచి తన ప్రాణము కాపాడుకొనుటకై" పారిపోయెను (3ఎ వచనం). ఇక్కడ ఒక వ్యక్తిని చూస్తున్నాం అతడు కర్మెలు పర్వతం మీద యుద్ధాయుదాలు ధరించిన వేలాది మందినైనా లెక్కచేయనివాడు, ఇప్పుడు ఒక రాణి కోపాగ్నికి తట్టుకోలేక పారి పోతున్నాడు.

అతడు "తన ప్రాణము కాపాడుకోడానికి యూదా సంబంధమైన బెయేర్షెబాకు పారిపోయాడు" (3బి వచనం). బెయేర్షెబా యూదాకు దక్షిణపు దిక్కున ఉన్నది – అది యెజ్రెయేలునుండి వందమైళ్ళు. ఏలీయాకు తినడానికి ఏమీలేదు, నిద్రకూడ ఎంతో కొంత, ఆ వందమైళ్ళు పరుగెత్తి పారిపోయాడు.

అతడు బెయేర్షెబాకు చేరిన తర్వాత, "అచ్చట ఉండమని తన దాసునితో" చెప్పెను (3సి వచనం). ఈ సేవకుడెవరో కాదు, యితని గురించి యింతకు ముందు అధ్యాయంలో చదువుకున్నాం.[2] ఏలీయాకు గల కారణాలేమో, అతన్ని మాత్రం అక్కడ వదిలిపెట్టడం జరిగింది.[3]

ఏలీయా బెయేర్షెబాలోనే నిలిచిపోలేదు, అక్కడకు దగ్గరలోనే సీనాయి అరణ్య ప్రాంతం ఉంది. దాంట్లోకి వెళ్లిపోయాడు. "తాను ఒక దినప్రయాణము అరణ్యములోనికి పోయి యొక బదరీవృక్షము క్రింద కూర్చుండెను" (4ఎ వచనం). కొన్ని కొన్ని అనువాదాలు "పరక చెట్టు" అంటున్నాయి. ఇది బహు చిక్కులతో ముడిపడిన గుబురులతో పది లేక పన్నెండు అడుగుల ఎత్తులావుంటింది. అక్కడ పెద్ద నీడంటూ ఉండదు, కాకపోతే మరీ లేనిదానికంటే ఉన్నది మేలు అన్నట్లుంటుంది.

అతడు "మరణాపేక్షగలవాడై" యున్నాడు (4బి వచనం).[4] ఇది చూడ్డానికి విడ్డూరంగా లేదూ? ఇక్కడేమో బతుకు జీవుడా అంటూ పారిపోయి వచ్చాడు. అనవసరంగా ఆ యెజెబెలు చేతిలో చావడమెందుకు అనుకున్నాడు. యిప్పుడేమో "నేను చస్తే మంచిది" అంటున్నాడు.

యింకా ఏమంటున్నాడంటే, "యెహోవా, నా పితరులకంటె నేను ఎక్కువవాడను కాను, ఇంతమట్టుకు చాలును, నా ప్రాణము తీసికొనుము" (4సి వచనం).[5] ఇక్కడేమని అర్థమవుతుందంటే "తాను తన పితరులకంటె ఎక్కువవాడననుకున్నాడు." వాళ్ళు చేయలేనిది తాను చేయాలని కుతూహలంతో ఉన్నాడు: అంటే ఇశ్రాయేలీయులను నిజమైన దేవుని వైపు తిరిగి తీసుకు రావాలని, త్రిప్పాలని. ఇక అది కుదరలేదు అందుచేత "నేను ఈ ప్రవక్త చిహ్నానికి గైరు హాజరు పలుకుతున్నాను అంటు యిక చావేనాకు గతి" అంటున్నాడు.

ఇక్కడ నిరుత్సాహానికి ఒక ప్రతీక మనం గమనిస్తున్నాము: ఒక ఘనుడైన వ్యక్తిని చూస్తున్నాము. ఎలాంటి నిరీక్షణ లేదు అన్న పరిస్థితుల్లో చూస్తున్నాం. పరిస్థితుల వలలో చిక్కుకు పోయిన వ్యక్తిని మనం చూస్తున్నాం. బహుశ మనందరం మన జీవితాల్లో ఏదో ఒక సమయంలో యిలాంటి పరిస్థితుల్లో చిక్కుకున్న వాళ్ళమే.

ఈ బదరీ వృక్షం క్రింద ఏలీయా కథ ఎలా ముగిస్తుందీ?

మొదట్లో, అతడు మానవతా రీతిలో ఆలోచించాడు, కాని దైవ ప్రత్యక్షత పై ఆధారపడి కాదు. ప్రభువుతో తనకున్న సంబంధ బాంధవ్యాలనుండి దిగజారి దారిమళ్ళాడు. ఈ క్షణం వరకు "యెహోవా వాక్కు తనకేమి సెలవిస్తుందో" దానిమీద ప్రతి సందర్భంలో వేచియుండి ప్రవర్తించాడు గాని, యిప్పుడైతే అలా కాదు. ఇప్పుడు తన స్వంత పరిజ్ఞానం మీద ఆధారపడ్డాడే గాని దేవుని చిత్తం మీద ఆధారపడలేదు.

అతనేగనుక "యెహోవా వాక్కు కోసం" వేచియున్నట్లయితే ఎంత బాగుండేదో కదా? ఇప్పుడతనేమంటున్నాడో నేను ఊహించుకోగలను, "దేవా, యెజెబెలు నా ప్రాణము తీయ టానికి కంకణం కట్టుకొంది, ఇక నేను భయకంపితుడనైయున్నాను."

"నీ పద్ధతి అంతా ఎగతాళిగావుంది! నీవు రాజును అతని పరివారాన్ని, 450 మంది ఆయుధాలు ధరించి వారి కత్తులు ఝుళిపించిన బయలు ప్రవక్తలను, వేలాది మంది ఇశ్రాయేలీయులను చిత్తు చిత్తుగా ఓడించిన వాడివి ఇప్పుడు ఆ పనికి మాలిన విగ్రహారాధికురాలి కోపానికి భయకంపితుడవైనావేంటి అసలు ఆమె నీకేం హాని చేయగలదు?"

"అయ్యో ఆమె నన్ను హతమార్చడానికి ప్రయత్నించుచున్నది."

"సరే ఆమె నిన్ను చంపిందనుకో ఏంపోయింది? నీ దేహాన్ని చంపేవారికి బయపడవద్దు.[6] ఒకవేళ ఆమె నిన్ను చంపివేసిందనుకో, నీవు నాతోకూడ సదాకాలం జీవించడానికి నా సన్నిధికి వస్తావు."

"నేనేం చేయాలి?"

"నీవెక్కడున్నావో అక్కడేవుండు. యింకా వేరేవేరే విషయాలున్నవి వాటిని ప్రయత్నిద్దాం!"

అయినప్పటికి, ఏలీయా "యెహోవా వాక్కు" కోసం వేచియుండలేదు. మనం మానవతా నేత్రంతో చూచినట్లయితే మనం టెలిస్కోపు తప్పుడు దిక్కున చూస్తున్నట్లుగా ఉంటుంది. అలాంటప్పుడు మన ఉద్దేశమే తారుమారవుతుంది.

రెండవదిగా, ఈ కారణాంతరాలవల్ల, ఏలీయా సరైన రీతిగా ఆలోచించలేక పోతున్నాడు. అతని ఆలోచనా విధానం సంకుచితమైయింది. అతని ఆలోచనా సరళి సరిగ్గా ఉండి యున్నట్లయితే, నేను వేలాది మందిని సైతం కర్మెలు పర్వతం మీద దేవుని సహాయంతో ఓడిం చాను కదా అలాంటప్పుడు యీ ఆడ మనిషికి భయపడతానా అని అనుకునేవాడే. దానికి మారుగా,

అతనిలో వ్యతిరేక భావాలు చెలరేగి అతని మనసును కల్లోలం చేశాయి.

మూడవదిగా, అతను ఎక్కడలేని భయానికి లోనయ్యాడు. మనం భయానికి బానిసలైయ్యాం అంటే అది మనలో గూడుకట్టుకుంటుంది. నా చిన్న నాటి అనుభవం నేను గుర్తు చేసుకుంటున్నాను. అప్పుడు నేను చీకటిలో నడుచుకుంటూ వెళుతుంటే నావెనుక ఎవరో మాట్లాడుతున్నట్లు భావించేవాడని. ఆ, దానిదేముందిలే అనుకుంటూ ఏదో ఈల వేసుకుంటూ నడిచేవాడిని. అలా నడుచుకుంటూ వేగాన్ని పుంజుకునేవాడిని. యిక వేగం ఎక్కువ ఉన్నకొలది నా బుడ్డిబుడ్డి కాళ్ళు నన్ను ఎత్తుకొని వెళుతున్నట్లు తెలివిగా అనుకునే వాడిని. నేను చివరగా యిల్లు చేరుకునే సరికి నా గుండెలు అవిసి పోయేవి దడదడ నా గుండె వేగంగా కొట్టుకునేది.[7] ఎప్పుడైతే ఏలీయా భయానికి బానిసైనాడో యిక అతను వందమైళ్ళు అంతకంటెపైగా అయినా లెక్కలేకుండ పరుగెత్తి పోయాడు.

నాల్గవదిగా, విజయం తర్వాత లోతట్టు సంభవాల గురించిన అవగాహన అతనికి లేదు. ప్రతి క్రీడా తర్ఫీదు నాయకుడు ఈ విషయం ముందుగానే ఎరిగివుంటాడు. ఈలాంటి అవగాహన లేనందువల్లనే క్రికెట్‌లో సూపర్ బౌలింగ్ చాంపియన్లు కూడ మరుసటి సంవత్సరంలో కూడ విజయం పొందక విఫలులవుతున్నారు. విజయం మనలను ఎవ్వరికి లొంగనివారిగా చేస్తుంది. ఈ రోజుల్లో ప్రభువు యొక్క పెద్ద పెద్ద సంఘాలు సైతం యిలాంటి అనుభవం కల్గియున్నాయి, ఆరాధనకు హాజరయ్యే వారి సంఖ్య క్రమంగా పడిపోయినందువల్లనో లేదా వారి సంఘ ప్రాముఖ్యమైన కార్యక్రమాలు రాను రాను తరిగిపోవడంవల్లను సంఘాలు పడి పోతుంటాయి. ఇక్కడ ఏలీయా సహజ పరిణామాలకు సంసిద్ధంగా లేడు.

ఐదవదిగా, అతడు తన శక్తికి మూలమైన దానినుండి వేరైనాడు. అతడు దేవుని వాక్కు కొరకు వేచియుండలేక పూర్తిగా దేవునినుండి వేరైనాడు; వ్యక్తులనుండి వేరైపోయాడు, మరి దానికి కారణాలేంటో అర్థం కాదు. చివరకు తన సేవకునికి సైతం వీడ్కోలు చెప్పాడు. ఇంతా చేసి చివరకు “లోకంలో ఏకాకి ఒంటరియై బ్రతికున్నవాడెవరయ్యా” అంటే ఏలీయా ఒక్కడే అని అర్థమవుతుంది.

నిరుత్సాహవంతులు ఎప్పటికీ ఒంటరివారే. ఒక వింత సత్యమేమంటే వారు భౌతికంగా ఒక్కరే దానికితోడు అందరినుండి వేరై దూరంగా వెళ్ళిపోతారు. “నేనెవరిని చూడను ఎవరు నన్ను చూడ్డానికి నాకిష్టం లేదు అంటూ” సమాజానికి దూరంగా అజ్ఞాతంలోకి వెళ్ళిపోతారు. ఇక అది అంతటితో ఆగిపోదు. భూ చక్రంలా సంభవిస్తునే ఉంటుంది.

దేవుడు మనలనెందుకు చేశాడంటే మనం యితరుల మీద ఆధారపడాలని, “నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదు” (ఆదికాండము 2:18). యేసు ప్రభువు సైతం గెత్సేమనె వనంలో తన శిష్యులను “తనతో మెలకువగా” ఉండవలసిందిగా కోరినాడు (మత్తయి 26:40).

ఏలీయా తనకు ఆధారభూతమైన దానినుండి వేరైపోయాడు.

ఆరవదిగా, అనవసరంగా అలసిపోయాడు, పాపం ఎన్ని రోజుల్నుండి తిండి తిప్పలు లేకుండ ఉన్నాడో? అతడు మైళ్ళ కొలది పరుగెత్తాడు. అటు భౌతింగా, ఇటు మానసికంగా, ఆత్మీయంగా కూడ అలసి సొలసి పోయాడు. గ్రీకులు ఒక సామెత చెబుతారు: “ఒక విల్లు ఎప్పుడూ వంచివుంచితే ఇరిగిపోతుంది.” ఏలీయా పూర్తిగా విరిగి పోయాడు.

ఈ రోజుల్లో ఉన్నపెద్ద సమస్య యిదే. మన కార్యకలాపాలు ఎలావుంటాయంటే లేదా

మనం ఎలా సిద్ధం చేసుకుంటామంటే అబ్బే రోజుకు ఇరవై అయిదు గంటలు, నెలలో ముప్పది రెండు రోజులకు సిద్ధంచేసుకుంటాం. మన జీవితాల రాజ్యమార్గంలో అతివేగవంతమైన రస్తాను ఎంపిక చేసుకున్నా దానికి మలుపు నిలుపు అంటూ ఏమీ లేవు. దూసుకొనివెళుతున్నా, ఇప్పటికన్నా మనం బోర్ల పడనట్లయితే పూర్తిగా అలసిపోతాం. అనవసరమైన ఆవేశాలకు గురవుతాం. భయాందోళనకు భగ్గున మండి మసైపోతాం. యిక్కడ దీనికి సంబంధించిన ఒక చిన్న సలహా యివ్వాలి: మీరు గనుక బాగా అలసిపోయివున్నారనుకోండి ఎలాంటి ముఖ్యమైన నిర్ణయాలు, తీర్మానాలు చేయవద్దు. ఏలీయా బాగా అలసిపోయాడు అలాంటి సమయంలో యెజెబెలును ముఖాముఖిగా ఎదుర్కొవాలా వద్దా అనే తీర్మానం సరిగ్గా చేయలేక పోయాడు కదూ!

ఏడవదిగా, తనను గురించి తాను జాలికలిగియున్నాడు. “నేను కష్టపడి ప్రయత్నించాను,” అతను అన్నాడు, “అయితే నేను దీనిని సాధించలేక పోయాను, నేను ఏమి అంత మంచివాడను కాదు!” యిలాంటి స్వభావం వినయతను ప్రదర్శిస్తుందని కొందరంటారు, అది నిజము కాదు. దానికి విరుద్ధమైన దానిని సూచిస్తుంది. అది ఎక్కువగా తనను గూర్చి ఆలోచించే కుటిలమైన స్వార్థ రూపం.

అతను స్వార్థ ప్రియుడుగా మారినాడు. తన విషయమై జాలికలిగియుండడం పెద్ద రాక్షసి. మన చెవుల్లో అబద్ధాలు నూరిపోస్తుంది. మనల్ను ఎక్కడలేని పొగడ్తలకు గురిచేస్తుంది. చివరకు తనకంటె యింకా దౌర్భాగ్యవంతులుగా మనలను మనకు కనబరుస్తుంది. ఆత్మవంచన ఒక వ్యక్తిని ఆత్మహత్యకు పాల్పడమని కూడ సలహాయిస్తుంది. “ఇంతవరకు చాలు ప్రభువా నా ప్రాణము తీసుకో!” అంటున్నాడు ఏలీయా.

ఏలీయా ఎక్కడున్నాడో చూస్తున్నావా? నిరుత్సాహ నిస్పృహలు ఈ గొప్ప దేవుని వ్యక్తిని కృంగ దీశాయి. ఇది ఎవరికైనా సంభవించవచ్చు. మోషే కూడ చావాలి అని అనుకున్నాడు. నన్ను చంపుము అని దేవుడిని అడిగినాడు (సంఖ్యాకాండము 11:15), అంతవరకెందుకు భక్తుడైన యోబు సైతం (యోబు 3:1ff.) మరియు యోనా (యోనా 4:3). పౌలు కూడ నిరుత్సాహస్థితిలో అనలేదా (2 కొరింథీయులకు 1:8). యిది బహుశ నీకు సంభవించవచ్చు.

## ఇలా కృంగిపోయినవారిని నయం చేయుటకు దేవుడేం చేశాడు (19:5-21)

యిక తర్వాత జరిగిన కథను పరీక్షిద్దాం. తర్వాత ఈ భయమును, నిరుత్సాహాన్ని తొలగించడంలో దేవుడు ఏంచేశాడో సమీకరిద్దాం. అలా చేయడంవల్ల ఒకవేళ మనకు మనం సహాయం చేసుకోడానికి – యితరులకు కూడ సహాయపడడానికి వీలు కలుగుతుందేమో.

> అతడు బదరీ వృక్షము క్రింద పరుండి నిద్రించుచుండగా ఒక దేవదూత వచ్చి అతన్ని ముట్టి – నీవు లేచి భోజనము చేయుమని చెప్పెను. అతడు చూచినంతలో అతని తలదగ్గర నిప్పులమీద కాల్చబడిన అప్పమును నీళ్ల బుడ్డియు కనబడెను గనుక అతడు భోజనము చేసి తిరిగి పరుండెను (5, 6 వచనాలు).

గతంలో దేవుడు కాకోలములను, ఒక విధవరాల్ని ఏలీయాకు భోజనము తెచ్చి అందించే

సేవకునిగా వాడుకున్నాడు; ఇప్పుడు ఒక దేవదూతనే వాడు కొంటున్నాడు.

> అయితే యెహోవా దూత రెండవమారు వచ్చి అతని ముట్టి – నీ శక్తికి మించిన ప్రయాణము నీకు సిద్ధమైయున్నది. నీవు లేచి భోజనము చేయుమని చెప్పినప్పుడు, అతడు లేచి భోజనము చేసి, ఆ భోజనపు బలముచేత నలువది రాత్రింబగళ్లు ప్రయాణముచేసి, దేవుని పర్వతమని పేరుపెట్టబడిన హోరేబునకు వచ్చి ... (7, 8 వచనాలు).

"హోరేబు" సీనాయి పర్వతానికున్న మరోపేరు. ఇక్కడ మోషే ధర్మశాస్త్రాన్ని అందుకున్నాడు.[9] (ఒకవేళ ఈ వంటల పుస్తకమే మనకున్నట్లతే మనం మిగతా 40 రోజులు వండుకునే వాళ్ళము కాదనుకో!)

తర్వాత "అచ్చట ఉన్న యొక గుహలో చేరి బసచేసెను"[10] (9ఎ వచనం). ఆ ప్రవక్త గుహలో నివాసం పెట్టాడు. ప్రపంచానికి దూరంగా వెళ్లిపోయాడు.

"ఇదిగో యెహోవా వాక్కు అతనికి ప్రత్యక్షమై" (9బి వచనం). "ఏలీయా యిచ్చట నీవేమి చేయుచున్నావు" (9సి వచనం) అని అడిగాడు. దీనిని దేవుడు ఎలా చెప్పాడో మనం ఎరిగియుంటె, యిది గద్దింపా కాదా అని మనం ఎరిగియుందుము. అదే గనుక గద్దింపు అయితే, అది మృదువైనది: "ఇశ్రాయేలులో నా పని చేస్తూ ఉండవలసిన నీవు యిక్కడ ఏమి చేస్తున్నావ్?"

యిక [ఏలీయా] తన మనసులో గూడు కట్టుకొనియున్న విషయాలను ఒకొక్కదాన్ని వల్లించడం మొదలు పెట్టాడు:

> అతడు[11] – ఇశ్రాయేలు వారు నీ నిబంధనను త్రోసివేసి నీ బలిపీఠములను పడగొట్టి నీ ప్రవక్తలను ఖడ్గముచేత హతము చేసిరి, సైన్యములకధిపతియు దేవుడునగు యెహోవా కొరకు మహా రోషముగలవాడనై నేను ఒకడను మాత్రమే మిగిలియుండగా వారు నా ప్రాణమును కూడ తీసివేయుటకై చూచుచున్నారని మనవి చేసెను (వచనం 10).

ఏలీయా ఏమంటున్నాడంటే, "ప్రభువా అంతా వృథా! యిక నిరీక్షణంటూ లేదు, యిక చేయగలిగింది కూడ ఏమిలేదు" అంటున్నాడు.

అప్పుడు దేవుడు అంటున్నాడు: "నీవు పోయి" (11ఎ వచనం). అంటే ఆయన ఏలీయాను ఆ గుహను వెంటనే ఖాళీ చేసి వెళ్ళిపొమ్మంటున్నాడు. "పర్వతము మీద యెహోవా సముఖమందు నిలిచియుండుమని సెలవిచ్చెను" (11బి వచనం). యింకోవిధంగా దేవుడే మంటున్నాడంటె, "గతంలో నీవు నా సముఖంలో నిలిచిన వ్యక్తివి అని పేరు తెచ్చుకున్నావు, నేను ఎలాంటి ఆజ్ఞలు జారిచేసిన వెంటనే అందుకోడానికి సిద్ధంగా ఉన్నావు. ఇప్పుడు మనిద్దరిమధ్య అలాంటి సంబంధబాంధవ్యాలను పునరుద్ధరించుకుందాం!"

> అంతట యెహోవా ఆ వైపు సంచరింపగా బలమైన పెనుగాలి లేచెను, భయమునకు పర్వతములు బద్దలాయెను; శిలలు ఛిన్నాభిన్నములాయెను గాని యెహోవా ఆ గాలి దెబ్బయందు ప్రత్యక్షము కాలేదు. గాలి పోయిన తరువాత భూకంపము కలిగెను గాని ఆ భూకంపమునందు యెహోవా ప్రత్యక్షము కాలేదు. ఆ భూకంపమైన తరువాత మెరుపు పుట్టెను గాని ఆ మెరుపునందు ప్రత్యక్షము కాలేదు. మెరుపు ఆగిపోగా మిక్కిలి నిమ్మళముగా మాటలాడు ఒక స్వరము వినబడెను (11సి, 12 వచనాలు).

ఇక్కడ KJV అనువాద ప్రకారం "మిక్కిలి మెల్లని స్వరం" అని ఉంది. బహుశ, అది మాత్రం గుసగుసలాడుతున్న శబ్దం కాదు, "ఏలీయా, ఏలీయా." అని పిలుస్తున్నట్లు కాదు సుమా! ఆదిమ హెబ్రీ భాష ప్రకారమైతే, "అది స్వరం లేక శబ్దం లేక నెమ్మదిగా ఉన్న నిశ్శబ్దపు ధ్వని" అని ఉంది. NASB అనే అనువాదం ఎలా సలహా నిస్తుందంటె, అది వసంతకాలంలో వీచే పిల్లగాలిలాంటిదని. అంతేకాదు ఒక చిన్న జంతు యొక్క మెల్లని కూతలాంటిది.

మరి దేవుడు దీన్నంతా ఎందుకు చేశాడో నాకింకా మింగుడు పడడం లేదు. మోషే ధర్మశాస్త్రాన్ని దేవునినుండి స్వీకరించే సమయంలో జరిగినట్టుగా తన సమయంలో కూడ జరగడం చూడడానికి యిష్టపడుతూ ఆ స్థలానికి ఏలీయా వచ్చాడేమో అనుకుంటున్నాను; అంతేగాక దేవుడు మహా శక్తిమంతుడు అన్నవిషయం నిఖరం చేసుకోడానికి కూడ అక్కడకు వచ్చాడు. మరోవైపు, దేవుడు నెమ్మదిగల జీవితాలలోను మరియు ఆకట్టుకొను పరిస్థితులలోను ఉంటాడు. ఏలీయా తెలుసుకొనవలనని దేవుడు యిష్టపడ్డాడు. అది ఊహా చిత్రమే. యిక్కడ గాలి, భూకంపం, అగ్ని, వీటన్నిటి *ఫలితమే* ఆ మెల్లని స్వరం. ఇదంతా దేవుడు చేసాడు ఎందుకంటే, ఏలీయాను ఆ గుహనుండి బైటకు లాగడానికే.

"ఏలీయా దానిని విని తన దుప్పటితో ముఖమును కప్పుకొని బయలుదేరి" (13ఎ వచనం). ఏలీయా దుప్పటి గురించి మనం వినడం ఇది మొదటిసారి, ఇది అతని సేవా ఉద్యోగానికి ఒక చిహ్నం, లేక గుర్తింపు (నోట్ జెకర్యా 13:4). బహుశ ఆ బొచ్చు దుప్పటి గొఱ్ఱె బొచ్చుతో నిండియుండినది, గొఱ్ఱె చర్మంతో తయారు చేయబడినవై యుండవచ్చు. "ఏలీయా ఆ గృహ వాకిట నిలిచెను" (13బి వచనం). ఈ గాలి దుమారం, భూకంపం మరియు అగ్ని కీలలు అతణ్ణి గుహ అంతర్భాగంలోనికి నెట్టుకొని పోయి యుండవచ్చు. కాని ఆ మెల్లని స్వరం మాత్రం అతన్ని గుహ ముఖద్వారంలోకి నడిపించింది. ఏలీయా మరీ మనం అనుకున్నంత దౌర్భాగ్య స్థితిలో లేడు, ఎంతో పురోగమనం చెందుతున్నాడు! మనం కూడ కృంగిపోయిన స్థితిలో ఉన్నవారితో ఉండి ప్రోత్సహిస్తుంటే, వారు కొంచెం కొంచెం అంచెలంచలుగా ముందడుగు వేసుకుంటూ వస్తారు: కొంచెం తటపటా యిస్తూ రెండడుగుల వెనుకకు రెండడుగులు ముందుకేసుకుంటూ చివరకు మూడడుగులతో ముందడుగువేస్తూ ఉంటారు.

"అంతలో – ఏలీయా ఇచ్చట 'నీవేమి చేయుచున్నావని యొకడు పలికిన మాట అతనికి వినబడెను' " (13సి వచనం). అదే ప్రశ్నను దేవుడు అంతకు ముందుకూడ వేశాడు. నాకొక స్నేహితుడు ఆస్ట్రేలియాలో ఉన్నాడు. అతడు యిలాంటి కృంగిపోయిన వారి మధ్య పనిచేస్తాడు. అతనంటాడు "యిలాంటి వారిని ప్రశ్నలు వేస్తూ; సంభాషణ మొదలు బెట్టాలంటాడు." ఏలీయా ఆ గృహలోకి ఎందుకు వెళ్ళాడో దేవునికి తెలుసు, కాని ఈ విధంగా ప్రశ్న వేయడం ద్వారా అతన్ని దారిలోకి వేద్దామని దేవుని ఉద్దేశం.

గమనించండి ఏలీయా యిచ్చిన జవాబు బహుశ యింతకు ముందు యిచ్చినట్టే ఉంది, మరీ మాటకు మాట అందించనట్లు:

> అందుకతడు – ఇశ్రాయేలీయులవారు నీ నిబంధనను త్రోసివేసి నీ బలిపీఠములను పడగొట్టి నీ ప్రవక్తలను ఖడ్గముచేత హతముచేసిరి. సైన్యములకధిపతియు దేవుడునగు యెహోవా కొరకు మహా రోషముగలవాడనై నేను ఒకడను మాత్రమే మిగిలి యుండగా వారు నా

ప్రాణమ తీసివేయుటకై చూచుచున్నారని చెప్పెను (14ఎ వచనం).

ఇక్కడ ఇదే రకమైన ఆలోచన ఏలీయా ఆలోచించి ఆలోచించి చివరకు ఆ ఆలోచనలు అతని మనస్సులో నిలిచి పెద్ద చిక్కుల వలై అతన్ని బంధీచేసింది; యిక ఆ చిక్కుల బంధీనుండి విడిపించుకోవాలంటే అతని తరం కావడం లేదు సుమా. నీ మనస్సు కూడ ఈ నిరుత్సాహ నిస్పృహల ఒత్తిళ్ళకు లొంగి పోయివుందా ఆలోచించిందే ఆలోచిస్తూ యిక రానురాను పిచ్చివాణ్ణి పిచ్చి దానను అవతానేమో అన్నంతగా నీవు దిగజారిపోయి ఉండివుంటావు.

వాస్తవానికి దేవుడు యీ అదునైన సమయంలో చడాబడ తిట్టి యుండాల్సింది లేక సరిచేయాల్చింది – కాని చూడండి ఆయనేమిచేశాడో: అప్పుడు యెహోవా అతనికి సెలవిచ్చినదేమనగా "నీవు మరలా అరణ్య మార్గమున దమస్కునకు పోయి" (15ఎ వచనం). "ఏలీయా ఆ గుహనుండి పూర్తిగా బయటకు వచ్చి ఉత్తర దిశగా దూసుకెళ్ళాడు." ఈశాన్య దిశగా గలిలయ సముద్రానికి ముప్పై మైళ్ల దూరంలో ఈ దమస్కు అరణ్యం ఉంది.

> అప్పుడు యెహోవా అతనికి సెలవిచ్చినదేమనగా – నీవు మరలి అరణ్య మార్గమున దమస్కునకు పోయి దానిలో ప్రవేశించి సిరియా దేశముమీద హజాయేలునకు పట్టాభిషేకము [12] చేయుము; ఇశ్రాయేలువారి మీద నింషీ కుమారుడైన యెహూకు పట్టాభిషేకము చేయుము; నీకు మారుగా ప్రవక్తయైయుండుటకు అబేల్మె హోలావాడైన షాపాతు కుమారుడైన ఎలీషాకు అభిషేకము చేయుము. హజాయేలు యొక్క ఖడ్గమును తప్పించుకొనువారిని యెహూ హతము చేయును; యెహూ యొక్క ఖడ్గమును తప్పించుకొనువారిని ఎలీషా హతము చేయును. [13] అయినను ఇశ్రాయేలు వారిలో బయలునకు మోకాళ్లూనకయు, నోటితో వాని ముద్దుపెట్టుకొనకయునుండు ఏడు వేలమంది నాకు ఇంకను మిగిలియుందురు (15బి–18 వచనాలు).

ఏలీయా చెప్పిన ప్రతి వ్యతిరేకపు విషయానికి దేవుడు జవాబిచ్చినట్లు గమనించండి:

ఏలీయా ఏమన్నాడంటే, "ఇశ్రాయేలీయులు నీ నిబంధన మరచినారు"; దానికే దేవుడు, "సిరియా రాజైన హజాయేలు వారిని శిక్షిస్తాడు" అన్నాడు. యిరుగుపొరుగు రాజ్యాలన్నింటిలో సిరియా ఇశ్రాయేలీయులకు బద్ధ శత్రువు.

ఏలీయా అన్నాడు, "అహాబు, యెజెబెలులు నీ బలిపీఠాలను కూలద్రోశారు" అని; అందుకు దేవుడు, "యెహూ అహాబు సంతతిని సర్వ నాశనం చేస్తాడు, తర్వాత బయలుకు ఆరాధనలుండవు" అని జవాబిచ్చాడు. యిక రాబోయే అధ్యాయాలల్లో, యెహూ రక్తాన్ని ఒలికించిన కార్యక్రమాలను గూర్చి చదవబోతున్నాం. అది యూదా చరిత్రలోనే ఎన్నడూ కనీవినీఎరుగనిది. అహాబు కుటంబాన్ని పూర్తిగా సమూల నాశనం చేశాడు. జోసీపస్ అనే చరిత్రకారుడు యెహూ ఏవిధంగా బయలు యొక్క దేవాలయాల్లోకి జొరబడి అక్కడ ఆరాధించేవారిని హతమార్చి వారి రక్తం బలి యివ్వబడిన వాటి రక్తంతో కలిసిపోవునట్లు చేశాడు అని జోసీపస్ అనే చరిత్రకారుడు చెప్పాడు.

ఏలీయా అన్నాడు, "నీ ప్రవక్తలను నరికివేశారు." "దానికి ప్రత్యామ్నాయంగా నీకు ఎలీషాను యిస్తాను" అని దేవుడన్నాడు.

ఏలీయా అన్నాడు, "నేనొక్కడనే మిగిలాను"; అందుకు దేవుడు, "బయలుకు మ్రొక్కని ఏడువేల మంది ఉన్నారు" అన్నాడు. ఇంకోరీతిగా చూచినట్లయితే దేవుడు ఏలీయాతో,

"ఏలీయా పరిస్థితులు యింకా చేయిదాటిపోలేదు. నిరీక్షణ కోల్పోవద్దు. ఇకనుండి నీవు నా సహాయంతో ప్రతి సమస్యను సవాలును నీవు యిట్టే ఎదురుకోగలవు" అన్నాడు. ఔను యిది ప్రతి దైవజనునికీ, భక్తిగల స్త్రీకీ నేర్చుకోదగిన ఎంతో గొప్ప పాఠము.

"కాబట్టి [ఏలీయా] అక్కడనుండి వెడలిపోతాడు" (19ఎ వచనం). చివరకు అతను గుహనుండి పూర్తిగా బయటకు వచ్చేశాడు. యిక దేవుడేది చెబితే అది తూచతప్పక పాటించడానికి, చేయడానికి సంసిద్ధుడైనాడు! అతడు తిరిగి దారిలోనికి వచ్చాడు. "ఏలీయా అచటనుండి పోయిన తర్వాత అతనికి షాపాతు కుమారుడైన ఎలీషా కనబడెను. అతడు తన ముందరనున్న పండ్రెండు అరకల యెడ్లచేత దుక్కి దున్నించుచు పండ్రెండవ అరక తాను తోలుచుండెను" (వచనం 19బి).[14] గత మూడున్నర సంవత్సరాలుగా ఎవరూ ఏ పంట వేయలేదు, బహుశ ఈ సమయం ఇశ్రాయేలు వ్యవసాయదారులకెంతో ఉత్సాహకరమైన సమయం అయుండవచ్చు.

యిక్కడ గిలాదు వాడును అచ్చంగ అడవి మనిషిలాంటి ప్రవక్త స్థానంలో యొర్దాను లోయ వాసియైన ఒక మురికి రైతును దేవుడు నియమించుచున్నాడు! నీవెవరివి అన్నది అంత ప్రాముఖ్యం కాదుగాని, నీయొక్క సమర్పణ మాత్రమే దేవునికెంతో ప్రాముఖ్యం ప్రీతికరం. నీ హృదయం ఆయనపై నిలిపియున్నట్లయితే ఆయన తన సేవకోసం నిన్ను తప్పక వాడుకుంటాడు!

"ఏలీయా అతని చేరపోయి తన దుప్పటి అతని మీద వేయగా" (19బి వచనం) – దేవుడు ఎలీషాను ఏలీయా యొక్క స్థానంలో నియమించుకుంటున్నాడు అని అతనికి తెల్పడానికి ఒక సంకేత సూచన అది.

> అతడు [ఎలీషా] ఎడ్లను విడిచి ఏలీయా వెంట పరుగెత్తి – నేను పోయి నా తలిదండ్రులను ముద్దుపెట్టుకొని తిరిగి వచ్చి నిన్ను వెంబడించెదనని చెప్పి అతనిని సెలవడుగగా అతడు– పోయి రమ్ము, నావలన నీకు నిర్బంధము లేదని చెప్పెను.[15] అందుకతడు అతనిని విడిచి వెళ్లి కాడియెద్లను తీసి, వధించి వాటిమాంసమును గొర్తినొగలచేత వంటచేసి జనులకు వడ్డించెను. వారు భోజనముచేసిన తరువాత అతడు లేచి ఏలీయా వెంబడి వెళ్లి అతనికి ఉపచారము చేయుచుండెను (వచనములు 20, 21).

ఎలీషా యిక్కడ తన మూటముల్లె సర్దుకుంటున్నాడు. యిక అంతటితో తన పాత జీవితానికి తెరబడింది. "అటు తర్వాత అతడు లేచి ఏలీయా వెంబడి వెళ్ళి అతనికి ఉపచారము చేయుచుండెను" (21బి వచనం). ఏలీయా అవసరాలపట్ల అతడు శ్రద్ధవహిస్తున్నాడు. అతడు "ఏలీయా చేతుల మీద నీళ్లు పోయుచుండెను," ఇది ఒకడు ఒక సేవకుని విధిని నిర్వహిస్తున్నాడనడానికి సరైన వివరణ (2 రాజులు 3:11).

ఏలీయా తన సైన్యాధిపతి యొక్క ఆజ్ఞలను శిరసావహించడానికి మరోసారి ముందుకు సాగుచున్నాడు.

దేవుడు ఏలీయాను కృంగజేసిన భయాందోళనలనుండి అతనిని విడిపించిన విధానాన్ని ఒక్క సారి సంక్షిప్తపరచుకుందాం:

మొట్టమొదటిగా, దేవుడు ఏలీయా యొక్క దైహికావసరాలను తీర్చాడు. ఆ ప్రవక్త తిని, త్రాగి, విశ్రాంతి తీసుకునేటట్టు చేశాడు. సహజంగా, ఒత్తిడులకు గురై కృంగిపోయిన వారితో

మనం మాట్లాడుతున్నప్పుడు వారు భౌతికంగాను మానసికంగాను ఎంతో అలసియుండడం మనం గమనిస్తాం. అతనికెంతో విశ్రాంతి అవసరం; అతనిపట్ల ఎంతో శ్రద్ధవహించవలసివుంది. కృంగిన స్థితిలో ఉన్న ఈలాంటి వారికి నేను యిచ్చే సలహా ఏమంటే, వారు వెంటనే ఒక డాక్టర్ దగ్గరకు వెళ్ళి పూర్తిగా చెకప్ చేయించుకోవాలి. మన శరీరాలు పరిశుద్ధాత్మకు ఆలయాలని మనం గుర్తుంచు కోవాలి (1 కొరింథీయులకు 3:16, 17). నేను సెర్సీ, ఆర్కన్‌సాస్ పట్టణాలకు వెళ్ళి అక్కడ "*ఈ రోజుకొరకైన సత్యాలు*" అనే విషయాలను వ్రాస్తున్నప్పుడు తలుపు దగ్గర ఏదో ఒక కల్పితమైన పువ్వు ఉంచి, నేను వ్రాస్తున్నప్పుడు మధ్యమధ్యలో ఆగి ఆ రోజా పువ్వులను వాసన చూస్తు ఉండవలసినట్లు నాకు గుర్తు చేయడానికి వాడుకుంటాను!

రెండవదిగా, దేవుడు ఏలీయాతో ఎంతో మృదువుగా వ్యవహరించాడు. చాలామంది క్రైస్తవ సలహదారులు ఏలీయా యొక్క నిరుత్సాహ కథను వినడానికి ఎంతో యిష్టపడతారు. యిక్కడ ఒక పాతిక, ఇరవై అయిదు పాయింట్లు ఆధునిక విధానమైన సలహా సంప్రదింపులకు పనికొస్తాయి; అంటే అతణ్ణి "ప్రశ్నించడం" యిలా "ప్రశ్నిస్తున్న కొద్ది సేపటికి అతనెలా స్పందిస్తాడంటే తన మీద లగ్నమైయున్న మనస్సును విడిచి పూర్తిగా దేవుని అధీనంలోకి వస్తాడు." యింతవరకు జరిగిందంతయు సమీకరిస్తే దేవుడు ఏలీయాతో ఎంతో *సున్నితంగా* వ్యవహరించాడని అర్థమవుతుంది.

ఏదో ఈ ఒక చిన్న పొరపాటునుబట్టి దేవుడు తన సేవకుని నెట్టిపారెయ్యలేదు. అతన్ని తక్కువ అంచనా వేయలేదు లేదా కించపరచలేదు. కాని దేవుని అపారమైన కృప శ్రద్ధవల్లనే అతడు మరలా ఎంతో ప్రయోజనకరమైన స్థితికి తిరిగి రాగల్గినాడు. దేవుడు ప్రేమగలవాడని మనం ఎరిగి ఉండాలి. ఆయన మన పక్షంగా ఉన్నాడు (రోమీయులకు 8:31). ఆయన మనలను *రక్షించడానికి* సిద్ధంగావున్నాడు (2 పేతురు 3:9). మనం ఆయన దగ్గరనుండి దూరంగా వెళ్ళిపోతే ఆయనెంతో ప్రేమతో ఎంతో సున్నితంగా వ్యవహరిస్తూ మనలను తిరిగి వెనక్కు తీసుకు వస్తున్నాడు (కీర్తనలు 23:3, 5; లూకా 15:4-6). మనం గనుక పశ్చాత్తాపపడినట్లయితే, ఆయన తన హస్తాలను బాహాటంగా చాచి మనలను ఆహ్వానించి స్వీకరిస్తాడు (లూకా 15:20ff.).

*మనం* ఎవరినైనా ఈలాంటి నిరుత్సాహ, నిస్పృహలతో కృంగిపోయిన వ్యక్తులతో వ్యవహరించేటపుడు ఎంతో కరుణతో సున్నితంగా వ్యవహరించవలెను.

మూడవదిగా, ఆయన ఏలీయాకు చేయడానికి పని యిచ్చాడు. ఆ రోజుల్లో నేను "సత్యముతో ప్రేమించుట" అనే టి. వి. ప్రోగ్రాములు నిర్వహించేటప్పుడు, డాక్టర్ విలియం జోన్స్‌గారు, ఓక్లహోమా క్రిష్టియన్ యూనివర్సిటి ప్రొఫెసర్, కార్యక్రమాన్ని సమర్పించారు. ఆయనగారి అంశం "అనుమానంతో ఎలా వ్యవహరించాలి" అనేది. దాని మీద ఆయన అనేక సందేశాల సరళిని నిర్వహించారు, ఎన్నెన్నో ఆచరణాత్మకమైన సలహాలను యిచ్చేవాడు. అన్నిటికంటె ప్రాముఖ్యమైన సలహా ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమైన సలహా. వ్యక్తిగతంగా మేలైన సలహా ఆయనిచ్చేదేమంటే "వెళ్ళి సేవచేయి! నీమీద నీవు ఆధారపడవద్దు. అసలు నిన్ను నీవు మర్చిపో. యితరుల గురించి ఆలోచించు; యితరులకు సహాయము చేయుటకు మనసు కలిగియుండుము."

యింకా అతని జీవితం అంతా అయిపోలేదు అంటూ ఏలీయాకు దేవుడు స్పష్టం చేస్తున్నాడు: "నీవు చేయాల్సిన ముఖ్యమైన పని ఎంతో ఉంది. అది మాత్రం అంతకు ముందు

నీవు చేసిన పనిలాంటిది కాదు (మన యొక్క సామర్థ్యం పెరుగుతున్నకొద్ది మనకివ్వబడిన పనులు మారుతూ ఉంటాయి). ఏదైతేనేం, అది చాలా ప్రాముఖ్యమైన పని. అదేమి ఆ కర్మేలు కొండ పై జరిగిన చారిత్రాత్మక సంఘటన కాదు, కాని యిప్పటిదాంట్లో ఎంతో నాటకీయ మలుపు మాత్రం ఉన్నది. నీవు యింకా అహాబు మనసాక్షితో సేవలందిస్తున్నావు. యింకో కొంత మోతాదు ఎక్కువ అగ్నిని ఆకాశంనుండి కురిపించడంలావుంటుంది." యిక్కడ దేవుడు మరో పనిని ఏలీయాకు కట్టబెట్టాడు. అదేమంటే, యువ ప్రవక్తలకు తర్ఫీదునిచ్చే ముఖ్యమైన పని, అంటే దేవుడేమంటున్నాడంటే, "ఓ ఏలీయా నీలోని ఈ పొరపాటువల్ల నిన్ను తీసి ఎక్కడో షెల్ఫ్‌లో పడేయడం లేదు, నీవు నాకింకా ఎంతో శ్రేష్ఠమైన సేవకునివే సుమా!"

ఒకవేళ నీవు ఎక్కడో ఒక మూలపడేయబడినట్టి అనుభవంలో ఉన్నావేమో, అంతటిలో ఆగిపోవద్దు నీవింకా ఎంతో శ్రేష్ఠమైన పరిచర్య చేస్తూ యితరులకు ఆశీర్వాదకరంగా నిలవాలని ఉబలాటపడుము. కొందరు మానసికంగా కృంగి సంక్షోభంలో ఉండియుంటారు అలాంటి వారిని ఆదుకొని వారికి సహాయ సలహాలనిస్తూ వారి జీవితాల ఉద్దేశాన్ని వారు గ్రహించేలా నడిపించుము.

నాల్గవదిగా, ఏలీయాకు దేవుడు ఒక స్నేహితుణ్ణి మరియు సహకారిని యిచ్చాడు. ఔను ప్రతి ఒక్కరికి మరొకరి అవసరం ఎంతైనా ఉంది. మనకైతే మన క్రైస్తవ స్నేహితుడు సహకారి కావలయును; వేరేవారికైతే ఒక క్రైస్తవ ప్రాణ స్నేహితుడు. మనందరికి యేసే స్నేహితుడైయున్నాడు. మనందరికి ఎవరో ఒకరు కావాలి. ఏలీయాకు దేవుడు ఏలీషా నిచ్చాడు.

మనలో కొందరం యిలా అనియుండవచ్చు, "నేను మా సంఘ కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొనాలనుకుంటున్నాను గాని, ఎన్నో ఆటంకాలున్నాయి. అందుచేత నేను ఏ గ్రూపులో చేరకుండ మానుకుంటున్నాను." మీరు ఎక్కడ దేవునారాధిస్తున్నారో అక్కడ యిది నిజమైతే, నాకెంతో విచారంగా ఉంది సుమా! ఏంపర్వాలేదు పాల్గొనండి. నీకంటె యింకా ఒంటరిగా ఉన్నావారిని నిరుత్సాహంతో కృంగిన వారిని వెదకి వారికి స్నేహితులుగా నిలవండి. ఆ విధంగా చేయడంవలన మీ యిద్దరు ఎంతో ప్రోత్సాహన్నిచ్చి ఆదరించేవారవుతారు. అటు మీరు అటు నీ నూతన స్నేహితుడు ఎంతగానో ఆశీర్వదించబడతారు.

## ముగింపు

గొప్ప విజయ సంకేతానికి సూచనయైన కర్మేలు పర్వతం దగ్గర కాదు మన సత్తా ఏదో చూచుకునేది. కాని ఒంటరితనం అనే సీనాయి పర్వతం దగ్గర మాత్రమే మనలను మనం అర్థం చేసుకొని మన శక్తి సామర్థ్యాలను బేరీజు వేసి చూచుకోగలం – మనం వూహించినట్లు పనులు జరగనప్పుడు, మనం నిరీక్షించినట్లుగా పరిస్థితులు సంభవించినప్పుడు.

మనం గనుక అక్కడవున్నట్లు గ్రహిస్తే, **ప్రభువుతో** మన సంబంధబాంధవ్యాలు ఏలావున్నాయో పరీక్షించుకొని చూచుకోవాలి. ఒకవేళ మన పరిస్థితి ఏలీయా పరిస్థిలా ఉందేమో, ఎందుకంటె మనం "**ప్రభువు** యొక్క వాక్కు" కోసం వేచియుండకుండ అతనిలా దిక్కుతోచని రీతిగా మైళ్ళకొద్ది పిచ్చిగా పరుగెత్తుతున్నావేమో. ఒక వేళ మనం ఆ వాక్కులు వినడానికి మన బైబిలు తెరచి చూడవలసిన అగత్యమున్నదేమో. తర్వాత ప్రభువు యొద్దకు తిరుగుము.

నీవు ఈ రోజున ఎక్కడవున్నావు? నీవు గనుక యిప్పుడు స్వార్థ-పరత్వం అనే గుహలో యున్నట్లయితే, యిప్పుడు ప్రభువు వైపు తిరిగి, ఆయనను నమ్ముకొనుము! ఇంకా ఆ గుహలో ఎందుకు ఉన్నావు బైటకు రా! ప్రభువును పూర్తిగా విశ్వసించు, నమ్ము. సీనాయి పర్వతాన్ని వదిలిరా. యిదిగో ఈ కల్వరి శిఖరానికి చేరుకో.

---

సూచనలు

[1]"అతను భయపడినాడు" అనేది హెబ్రీ భాషలోని హల్లు "అతడు చూచినాడు" అన్న భావంతో వాడబడినది (KJV యింకా యితర అనువాదాలు కూడ చూడండి); యిక్కడ అచ్చులు మార్చబడినాయి. చాలా ఆధునిక తర్జుమాలు సెప్టూగెంట్ తర్జుమాను అధారంగా తీసుకొనబడినందున "అతడు భయబడినాడు" అని అర్థం వస్తుంది. [2]ముందు పాఠాల్లో దీనికి సంబంధించిన నోట్సు చూడు. [3]అతణ్ణి వదలి వచ్చాడు కాబట్టి అతివేగవంతముగా ప్రయాణం చేయగల్గినాడు. బహుశ అతన్ని వదలి పెట్టడం కేవలం తన సేవకుని క్షేమార్థమేనని గమనించాలి. ఎందుకంటె దేవుడు మనకు చెప్పలేదు కాబట్టి ఊహించుకోవడం అనవసరం. [4]అది మీ ఇష్ట ప్రకారం: ఒక చేతి రుమాలు ఉపయోగించు. "దృశ్యసాధనాలు" నోట్సు చూడు. [5]ఏలీయా కర్మెలు పర్వతం మీద చేసిన ప్రార్థనకు ప్రస్తుతం చేసిన ప్రార్థనకు వ్యత్యాసం చూడండి: 1 రాజులు 18:36, 37. [6]మత్తయి 10:28. [7]మీ యిష్ట ప్రకారం: మీ గుండెమీద చేత్తో కొట్టుకోండి, ఈ విధంగా మీ గుండె చప్పుడు చేస్తుంది అని చూపించడానికి మైక్ దగ్గరలో ఉండి చేస్తే బాగా వినబడుతుంది. [8]ఇక్కడ హెబ్రీ భాషలో అర్థం, "రాళ్ళు" లేక "బొగ్గులు" అని (KJV యింకా యితర తర్జుమాలను చూడండి). బదరీవృక్షం/చీపురు చెట్లులను బొగ్గు తయరు చేయడానికి వాడతారు. [9]అచారపరమైన సీనాయి పర్వత క్షేత్రంనుండి బెయేర్షెబాకు మధ్య 150 మైళ్ళ దూరం ఉంది. వాస్తవానికి ఈ దూరం నడవడానికి నలభై రోజులు పట్టనే పట్టదు. అంటే జరిగిన ఈ సంఘటనలన్నింటికి పట్టిన సమయం (ప్రయాణానికి, అక్కడ గడిపిన సమయం, తిరిగి వచ్చిన ప్రయాణం) అంతా కలిసి నలభై రోజులు పట్టియుండవచ్చు. యింకో వాస్తవమేమంటే ఈ సీనాయి పర్వతం ఏదో వేరే స్థలంలో యుండియుండవచ్చు. బర్టన్ కాఫ్‌మాన్‌గారు రాజులు మొదటి గ్రంథము మీద వ్రాసిన వ్యాఖ్యానం చదవండి. [10]మూల గ్రంథంలో ఇది "ఒక గుహ" అని ఉంది. చాలా మంది ఏమని నమ్ముతున్నారంటే, ఆదిలో మోషే దేవుని ఆ కొండ మీద ముఖాముఖిగా చూచిన స్థలమంటారు, ఆ స్థలానికే ఏలీయా కూడ ఈ పవిత్ర స్థలానికే పనిగట్టుకొని వెళ్లినాడు అంటారు. కాని అది ఒక రాతి శిఖరం, ఇది ఏలీయా నివసించిన గుహ.

[11]మీ యిష్టమైతే: మరలా ఒక చేతి రుమాలు వాడండి. దృశ్యసాధనాల నోట్సు చూడండి. [12]"అభిషేకించు" అనే మాట ఒక చిహ్నాన్ని చూపించడానికే 15 మరియు 16 వచనాల్లో వాడబడింది. అక్కడ ఎక్కడా కూడ ఏలీయా ఎవరి తలమీద తైలము పోసి అభిషేకించినట్లు లేదు. ఎలీషా తలపై కూడ పోయలేదు అన్నట్లుంది. ఇక్కడ ప్రత్యేకించి చెప్పబడిందేమంటే ఏలీయా దేవుని ప్రతినిధిగా నిలిచి ఆయన ఘనమైన సేవకునిగా పనిచేశాడు, మరొక్కసారి తనపట్ల దేవునికున్న ప్రణాళికతో తిరిగి విలీనమయ్యాడు. [13]ఎఫెసీయులకు 6:17; హెబ్రీయులకు 3:12. ఎలీషా అవినీతిపరులను దేవుని వాక్యంద్వారా "చంపినాడు," ఆ విధంగా దైవభక్తి లేనివారి మీదికి తీర్పు దిగి వస్తుంది. [14]యిక్కడ ఎలీషా కుటుంబం ఎంతో భాగ్యవంతమైనదని, వారికి ఇరువదినాల్గు ఎడ్లు ఉన్నాయనడం ద్వారా తెలుస్తుంది. ఒకవేళ అంతగా ధనవంతుడు అయుండక పోవచ్చు; బహుశ ఆ ప్రాంతంలో ఉన్న రైతు జనాంగం ఈ కుటుంబంతో కలిసి పని చేయడానికి ఎంతో యిష్టపడియుండవచ్చు, మొదట అందరూ కలిసి ఒక పొలంలో పనిచేసి తర్వాత వేరొక పొలాలలో పని చేస్తూ ఉండియుండవచ్చు. [15]ఇది బహుశ తిట్టడం కాకపోవచ్చు. లూకా 9:57-62లో కాబోయే శిష్యులు చెప్పినట్లు యిక్కడ ఎలీషా మాటలు ఏదో సాకులు చెప్పడం అనుకోకూడదు. అక్కడ ఆ వ్యక్తులు క్రీస్తును అనుసరించడం మానేద్దాం అన్న ఉద్దేశంలో ఉన్నారు. యిక్కడ ఎలీషా వెళ్ళి తన తలిదండ్రులకు వీడ్కోలు చెబుతూ చిన్న ముద్దుతో బైటకు రావడం తప్ప వేరే ఏమీ వివరణలు మనకు కనబడలేదు. ఏలీయా మాటలను బట్టి చూస్తే ఏలీయా అతనితో "నీవు త్వరగావెళ్ళి మీ తలిదండ్రుల దగ్గర శెలవు తీసుకొనిరా అన్నట్లున్నది. నేను చేసేదెల్లా నీకొక ఉద్యోగం యివ్వడం మాత్రమే. నీవు నీ కుటుంబంతో అన్ని సంబంధాలు తెగతెంపులు చేసుకోమని మాత్రం చెప్పడం లేదు." [16]ఈ ఆలోచన ఎవరితో ప్రారంభమైందో తెలియదు. అనేక సంవత్సరాల క్రితం ప్రెంటెస్ మేదర్ జూనియర్ అనే అతను "ఏలీయా నిరుత్సాహ పడినవేళ" అనే అంశం మీద తన వ్యాఖ్యాన పూర్వక ఉపన్యాసం ఓక్లహోమ క్రిష్టిన్ ఉపన్యాసాలా సరళిలో అందించిన విధానం నేను విన్నాను. అప్పటినుండి కూడ రానురాను ప్రతివారు ఈ ప్రసంగాన్ని ఒక మాదిరి ప్రసంగంగా వాడటం మొదలుపెట్టినారు అంటే నిరుత్సాహంలో కృంగిన స్థితిలో ఉన్న వారికోసం ప్రత్యేకం అన్నట్లుంది.

## దృశ్య సాధనాల-నోట్స్

నీ జేబులో ఒక తెల్లని చేతి రుమాలు ఉంచుకో. ఏలీయా తన విషయమై తాను దుఃఖితుడైయున్నాడు అని నీవు చెబుతున్నప్పుడు నీ చేతి రుమాలుతో నీ కళ్ళను తుడుచుకో. ఏలీయా తన పాత పరిస్థితులకు స్వస్థి చెబుతున్నప్పుడు దానికి సూచనగా చేతి రుమాలును ఒక జండాలాగ వూపుము. ఇక నీవు కథలో ముందుకు కొనసాగెటపుడు ఆ రుమాలును అందరికి కనబడెలాగున వేదిక మీద నీ ప్రక్కనే పెట్టియుంచుకో. యిక కథ చివరకు వచ్చేసరికి అంటే ఏలీయా దారిన బడ్డాకే నీ చేతి రుమాలు అందరికి ఎదురుగా నీచొక్కా జేబులో పెట్టుకొనుము. ఒక్కసారి సంతృప్తిగా సంతోషంగా గాలి పీల్చుకో, అంటే నీవు నీ స్వార్థ-పరత్వం నుండి బైటపడ్డావు. యిక "దేవునితో కలిసి ముందుకు సాగు."

## పాఠం యొక్క సంక్షిప్త వర్ణన

**పరిచయం**

A. వర్షంకోసం ఏలీయా ప్రార్థన చేయగా దానికి జవాబు లభించినప్పుడు అతడెంతగానో ఉత్తేజితుడయ్యాడు. 19వ అధ్యాయంలో ఎంత వ్యత్యాసాన్ని చూస్తున్నాం!
   1. ఏలీయా మనలాంటి స్వభావంగల మనుష్యుడే (యాకోబు 5:17; యాకోబు బహుశ 1 రాజులు 19వ అధ్యాయం గురించి ఆలోచించియుండవచ్చు.
   2. ఏలీయా మనలాగనే నిరుత్సాహ పడినాడు. అంతేగాక, అలా నిరుత్సాహ పడిన దేవుని మనుష్యుల్లో అతనొకడు మాత్రమే కాదు:
      a. మోషే (సంఖ్యాకాండము 11)
      b. యోనా (యోనా 4)
      c. పౌలు (2 కొరింథీయులకు 1)

B. ఏలీయా యొక్క సమస్యనిక్కడ గ్రహిద్దాం. అతనెలా సమస్యల్లో యిరుక్కున్నాడు. దేవుడు ఆ విషయంలో ఎలా సహాయం చేశాడు (1 రాజులు 19).[16]

### I. భయాందోళనలతో కృంగదీసిన ఒక సమస్య (19:1-4)

A. ఏలీయా ఆ దేశం మీద ఎంతో నిరీక్షణతో ఆ పట్టణ ద్వారంలో ప్రవేశించాడు.
   1. ఏలీయా నిరీక్షించినట్లు ఏది జరగలేదు (1 వచనం). యెజెబెలు ఉగ్రురాలై మండి పోతుంది.
   2. యెజెబెలు ఒక హంతకుణ్ణి పంపడానికి బదలు ఒక వర్తమానికుని పంపడమెందుకు? (2 వచనం)? బహుశ ఆమె ఏలీయాతో ముఖాముఖి ద్వంద యుద్ధానికి సవాలు వేస్తుందేమో.
   3. 450 మంది బయలు ప్రవక్తలను ఒక పట్టున ఎదుర్కొన్న ఈ మొనగాడు ఆ రాణి యొక్క దెబ్బకు తట్టుకోలేక కాళ్ళకు బుద్ధిచెప్పాడే (3 వచనం).
   4. అక్కడ ఒక బదరీవృక్షం క్రింద ఆగి పోయాడు (4 వచనం). యిక

నిరుత్సాహాన్ని గురించిన శ్రేష్ఠమైన పదాలిక్కడ ఉన్నాయి.

B. ఆ బదరీవృక్షం క్రింద ఏలీయా ఎలాగడిపాడు?

1. మానవతా తర్కంతో నడిపించబడినాడు. అంతేగాని దైవ బయల్పాటు ద్వారా కాదు. ఈ సమయంలో అతడు "యెహోవా వాక్కు కొరకు" వేచియుండలేదు.
2. అతని ఆలోచనా విధానం బాగుగా లేదు.
3. అతడు భయానికి తావిచ్చాడు. మనం కూడ యిలా భయానికి తావిచ్చామంటే, అది మనలో పుట్టగొడుగుల్లా పెరిగి పోతుంది.
4. విజయానంతరం వచ్చే పరిణామాలకు అతడు సంసిద్ధంగా లేడు. విజయం తర్వాత కూడ మనలో లొంగు చోటుతనం ఎదురౌతుంది.
5. అతనికి శక్తికి మూలమైన పెన్నిధినుండే అతను దూరమైనాడు.
    a. దేవుని వాక్కు కోసం అతడు వేచియుండలేదు.
    b. తన సేవకునికి వీడ్కోలు చెప్పినాడు.
6. అనవసరంగా అలసిపోయాడు. (మీరు గనుక బాగా అలసిసొలసివుంటే దయచేసి తీర్మానాలు చేయకండి)!
7. అతను స్వార్థ ప్రియుడుగా మారినాడు, ఈ స్వార్థ ప్రియత్వం అన్ని అబద్ధాలనే మనకు బోధిస్తుంది. ఒక చిన్న అబద్ధాన్ని ఇంతింత అంతంత చేసి మనం నమ్మేటట్లు చేస్తుంది. స్వార్థ ప్రియత్వం ఒక వ్యక్తిని ఆత్మహత్యకు పాల్పడేలా చేస్తుంది, అలా నడిపిస్తుంది.

**II. ఇలా కృంగిపోయినవారిని నయం చేయుటకు దేవుడేం చేశాడు (19:5-21)**

A. ఏలీయాకు కావలసిన శరీర అక్కరలు, విశ్రాంతి, ఆహారాన్ని దేవుడతనికి సమకూర్చినాడు (5-8 వచనాలు).

B. దేవుడు ఏలీయాతో ఎంతో సున్నితంగా వ్యవహరించాడు. అతనికున్న ఈ కష్టాలన్నిటికి అతడే కారణమంటూ ప్రేమతో మందలించాడు (9-14 వచనాలు).

1. ఏలీయా తన్నుతాను తెలుసుకోడానికి దేవుడు కొన్ని ప్రశ్నల ద్వారా అతనికవకాశం యిచ్చాడు.
2. తర్వాత కొన్ని శబ్దాలు చేస్తూ ఆ శబ్దాలకు ఏలీయా ఆ గుహలోనుండి బయటకు వచ్చేట్టు చేశాడు.

C. ఒక అర్థవంతమైన పని చేయడానికి ఏలీయాకు దేవుడు పనిపెట్టాడు (15-18 వచనాలు).

1. గతంలో ఏలీయా చెప్పిన వాటన్నిటికి దేవుడు జవాబు యిచ్చాడని గమనించు.
    a. ఏలీయా: "ఇశ్రాయేలీయులు నీ నిబంధన నెట్టివేశారు"; దేవుడు: "సిరియ రాజైన హజాయేలు వారిని శిక్షిస్తాడు."
    b. ఏలీయా: "అహాబు, యెజెబెలులు నీ యొక్క బలిపీఠాలను కూల

ద్రోశారు"; దేవుడు: "యెహూ అహాబు సంతతిని సర్వ నాశనం చేస్తాడు. దాని తర్వాత యిక బయలు ఆరాధించడం అనేది ఉండదు."

c. ఏలీయా: "వారు నీ ప్రవక్తలను ఊచకోత కోసినారు"; దేవుడు: "ఆ స్థానంలో నేను వేరేవారిని ఏర్పాటు చేస్తాను (ఎలీషా)."

d. ఏలీయా: "నేనొక్కడనే మిగిలియున్నాను"; దేవుడు: "బయలుకు మోకాళ్ళూనని ఏడువేల మంది ఉన్నారు."

2. "ఓ ఏలీయా యింతటితో నీ జీవితం ముగిసింది అనుకోవద్దు; యింకా నీవు చేయవలసినమేలుకరమైన అర్థవంతమైన పని ఉన్నదని" దేవుడు ఏలీయాకు స్పష్టం చేశాడు.

a. "కర్మెలు పర్వతం మీద అప్పటిలాంటి గొప్ప సంఘటన మరో సారి జరుగుతుందని కాదుగాని, అనేక పరిస్థితులు నాటకీయంగా మలుపుతిరగ బోతున్నాయి."

b. అంతేగాక యువకులకు తర్ఫీదునిచ్చే పనిని అతనికోసం దేవుడు సిద్ధం చేశాడు!

D. ఏలీయాకు దేవుడు ఒక స్నేహితుని, సహచరుణ్ణి యిచ్చాడు (19-21 వచనాలు).

1. ఏలీయా ఆ చీకటి బిలంనుండి బైటపడ్డాడు, దేవుడు తనకు చెప్పింది చేయడానికి సంసిద్ధుడైనాడు. "కంచె దూకి పారిపోదామని" ప్రయత్నించాడు ఏలీయా. అయితే దేవుడు తిరిగి అతన్ని మంచి మార్గంలో పెట్టినాడు!

2. ఏలీయా ఎలీషాను కనుగొన్నాడు. ఏలీయా అంతా అడవి మనిషి; ఎలీషా వ్యవసాయదారుడు. వారెలాంటి వరములుగలవారైనా వేరేవేరే వ్యక్తిత్వంగలవారైనా సరే వారుగనుక దేవునికి సమర్పించుకున్నట్లయితే ఆయన వారిని వాడుకుంటాడు.

3. ఎలీషా ఏలీయాను వెంబడించాడు "అతనికి సేవలు చేశాడు" (21 వచనం). ఏలీయాకు ఏది అవసరమైందో దాన్ని ఎలీషా సరఫరా చేశాడు. మనందరికి కూడ స్నేహితులు అవసరమైయున్నారు!

**ముగింపు**

A. మనమెలాంటి వారంగా నిరూపించబడినాము అనేది విజయం అనే పేరుగల కర్మెలు పర్వతం దగ్గర కాదు, ఒంటరితనం అనే సీనాయి పర్వతం దగ్గర మాత్రమే. ఎప్పుడైతే మనం ఊహించుకున్న పరిస్థితులు జరగలేదో అప్పుడు, ఏదైతే నిరీక్షించామో అది జరిగినప్పుడు.

B. నీవు చీకటి గుహ అనబడిన నీ స్వశక్తిపై ఆధారపడియున్నట్లయితే, ప్రభువు వైపు తిరుగుము ఆయననే నమ్ముకో! ఆ గుహనుండి బైటకు రమ్ము!